

# డాక్టర్ వంశీ ఎం.బి.బి.ఎస్.

## ఎం. వెంకటేశ్వరరావు

కథ

**ఆదివారం సాయంత్రం. రైతు బజార్నుండి బయటికొస్తున్న నా కాళ్ళకి ఎవరో బ్రేకు వేసినట్లు సడన్‌గా ఆగాయి. ఎటో చూస్తున్న అతన్ని పరికించి చూసి, గుర్తుబట్టి, ఆగాను. నన్నూ అతను చూశాడు. అతని చూపుల్లో నిర్లక్ష్యం. మొహం పక్కకి తిప్పుకుని ఎటో చూస్తుంటే, ఎదురుగ్గా వెళ్ళి నిలబడ్డాను. ఈసారి అతను నన్ను చూడటం లేదు. చేతిలో కాల్తున్న సిగరెట్ తీసి, నోట్లో పెట్టుకుని పొగ పీలుస్తున్నాడు.**

"ఛ! అనవసరంగా ఆగాను" అనుకున్నాను.

కన్పించగానే చూసీ చూడనట్టు తప్పించుకుపోయేవాళ్ళు కొందరైతే, ఎదురు పడగానే వేరే గత్యంతరం లేక, వినయం పులుముకున్న మొహంతో మొహమాటానికి 'నమస్కారం సార్' అని నటించేవాళ్ళు కొందరు, చూడగానే కుశల ప్రశ్నలడిగి, తామున్న స్థితిని తెలియజెప్పే వాళ్ళు కొందరు, "ఇన్నేళ్ళు గడిచినా నా పేరు జ్ఞాపకముంచుకోవడం మీకెలా సాధ్యం సార్" అని ఆశ్చర్యపోయేవాళ్ళూ... ఇలా రకరకాల మనస్తత్వాల వాళ్ళు తరచూ తటస్థపడుతూనే ఉంటారు.

ఇల్లొదిలి బయటికొస్తే... నా దగ్గర చదువుకున్నవాళ్ళు, చదువుకుంటున్నవాళ్ళు ఎంతో మంది కన్పిస్తుంటారు.

కొంతమంది మేం డాక్టరనో, ఇంజనీరనో, కలక్టరనో తమ అభివృద్ధిని నాతో పంచుకుంటుంటే, అధ్యాపకుడిగా సమాజానికి ఎంతో కొంత ఉపయోగపడ్తున్నందుకు సంతోషంగా ఉంటుంది.

ఇదుగో... ఈ వంశీ, మొదట్నుంచీ వ్యత్యాసంగానే ఉండేవాడు. అయినా సరే వీడంటే ఏదో తెలియని అభిమానం ఉండేది నాకు. చాలా కాలం తర్వాత ఇదుగో... ఇవ్వాళ ఇక్కడ ఇలా ఎదురుపడ్డాడు. ఎదురుగా ఉన్న నన్ను పట్టించుకోకుండా మళ్ళీ సగం కాలిన సిగరెట్ ముట్టిస్తుంటే...

"వంశీ!" పిల్చాను.

ఉలిక్కిపడ్డట్టు నా వైపు చూసి, మర్యాద కోసం నోట్లో కాల్తున్న సిగరెట్ తీసి, చేతిని వెనక్కి పెట్టుకున్నాడు. నోటి నిండా ఉన్న పొగ కష్టపడి దాచాలని ప్రయత్నించాడు. కానీ అమాంతం దగ్గు తెర రావడంతో, పొగంతా నా మొహం మీదే ఊదేసి పక్కకి తప్పుకుని నిలబడ్డాడు. ఎంతో మందిలాగా వీడూ నాకు ఎదురు పడకుండా తప్పుకెళ్ళొచ్చు. ఎందుకో అలా వెళ్ళకుండా వెళ్ళలేక, ఉండలేక నిలబడిపోయాడు. అతని పరిస్థితి గమనించి, "ఎలా ఉన్నావురా? వంశీ? ఏం చేస్తున్నావు?" అన్నాను.

"... ..."

నేను కార్పొరేట్ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పన్జేస్తున్నాను. నా అధ్యాపక వృత్తిలో తారసపడ్డ వేలాది విద్యార్థుల్లో వంశీ ఒకడు. బహుశః నాల్గేళ్ళయిందనుకుంటాను. పదో తరగతి ఫలితాలొచ్చాయి. కాలేజీల్లో అడ్మిషన్ల జోరు మొదలయింది. నేను పన్జేస్తున్న కాలేజీలో అడ్మిషన్ కోసం వాళ్ళమ్మని వెంటబెట్టుకొచ్చాడు వంశీ. మంచి రంగు, రూపం, వాటికి తగ్గ దుస్తుల్లో కుర్ర హీరోలా దర్పంగా కన్పించాడు. నా ఛాంబర్లోకి వచ్చిన తల్లీ కొడుకుల్ని చూసి నవ్వుతూ ఆహ్వానించి కూచోమన్నాను.

పదో తరగతి సర్టిఫికేట్ ప్రకారం... 92% ఉంది. మ్యాథ్స్‌లో 96%, సైన్సులో 89% మార్కులొచ్చాయి.

"వెరీ గుడ్... ఎం.పీ.సీ.లో చేరుస్తారా?" అనడిగాను.

"లేదండీ! మా వాణ్ణి బై.పి.సి.లో చేర్చాలనుకుంటున్నాను"

"లెక్కల్లో మంచి మార్కులొచ్చాయి గదా!"

"కావొచ్చు. కానీ వాడు బై.పి.సి.లోనే చేరతాడు".

"మెడిసిన్ చదివిద్దామనుకుంటున్నారా?"

"అవును" అందామె దృఢంగా.

"అవునా? మెడిసిన్ చదువుతావా?" అన్నాను వంశీవైపు తిరిగి.

"ఊహూ... నాకు మెడిసిన్ ఇంట్రస్ట్ లేదు. ఎం.పి.సీ.లోనే చేరతా" అన్నాడు వంశీ వాళ్ళమ్మతో.

"నువ్వు నోర్మూయ్యి. చెప్పిందంతా విని మళ్ళీ మొదటికొస్తావేం" అందామె కొడుకువైపు కోపంగా చూస్తూ.

"వాణ్ణి చెప్పనివ్వండమ్మా".

"వాడు చెప్పేదేం లేదండీ! వీణ్ణి డాక్టరు చదివించాలన్నది వాళ్ళ నాన్న ఆశ, ఆశయం. ఇవన్నీ దగ్గరుండి చూసుకునే అదృష్టం ఆయనకెలాగూ లేదు. ఆయన ఆశపడ్డది నెరవేర్చడం నా బాధ్యత".

"కరెక్టే! వాడికి ఇంట్రస్ట్ లేదంటుంటే... ఏం చేస్తాం?"

"క్రియేట్ చేస్తారనే మీ దగ్గరకొచ్చింది. పోయిన సంవత్సరం మీ కాలేజీకే మెడిసిన్‌లో ఎక్కువ ర్యాంకులొచ్చాయి గదా! అందుకని..."

"ఒ.కే... కాదనడం లేదు. ఎందుకైనా మంచిది మీరు మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోండి" అన్నాన్నేను.

**ఈ వంశీ, మొదట్నుంచీ వ్యత్యాసంగానే ఉండేవాడు. అయినా సరే వీడంటే ఏదో తెలియని అభిమానం ఉండేది నాకు. చాలా కాలం తర్వాత ఇదుగో... ఇవ్వాళ ఇక్కడ ఇలా ఎదురుపడ్డాడు. ఎదురుగా ఉన్న నన్ను పట్టించుకోకుండా మళ్ళీ సగం కాలిన సిగరెట్ ముట్టిస్తుంటే...**

"ఇందులో ఆలోచించడానికేముందండీ! ...పిల్లలేదో తెలిసీ తెలీక చెప్తుంటారు. పెద్దవాళ్ళం మనమే గైడెన్స్ ఇవ్వాలి. మా వంశీకి మెడిసిన్‌లో సీటు వచ్చేలా చదివించే బాధ్యత మీదే. ఎంత ఖర్చయినా ఫరవాలేదు. స్పెషల్ క్లాసులే పెడతారో, స్పెషల్ లెక్చరర్స్‌తో లెసన్స్ చెప్పిస్తారో, ట్యూషన్లు అరేంజ్ చేస్తారో మీ ఇష్టం. వాడు మాత్రం డాక్టరవ్వాల్సిందే" అందామె ధన దర్పంతో.

"అలా కాదమ్మా! పిల్లల అభిరుచికి అవకాశమివ్వాలిగా!"

"ఏమిటండీ! వాడి అభిరుచి? ఎం.పి.సి. తీసుకుని ఇంజనీరింగ్

చేస్తాడు. రోజుకో ఇంజనీరింగ్ కాలేజీ ఊరుకొకటి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. చదివేవాళ్ళు లేక సీట్లు ఎక్కువై ఖాళీగా పడుంటున్నాయి. ఇంజనీరింగ్ అప్లికేషన్లు అమ్ముడు కాక కుప్పలు తెప్పలుగా మిగిలిపోతున్నాయి. ఎక్కడో ఊరికి పది మైళ్ళవతల కాలేజీలు... ఇన్ఫ్రాస్ట్రక్చరుగాని, లెక్చరర్స్‌గానీ ఉండరు. ఇహ వీడు ఇంజనీరింగ్ చదివొచ్చేసరికి వీధికో ఇంజనీరింగ్ కాలేజీ పుట్టుకొస్తుంది. ఒకవేళ మీ కాలేజీలో మా వాడికి అడ్మిషన్ లేదంటే, వేరే కాలేజీలో చేరుస్తానంటూ" ఆమె తన అభిప్రాయాన్ని ఒకింత ఆవేశంగా అప్పజెప్పింది.

ఆమె మూర్ఖత్వానికి మౌనం వహించి, అడ్మిషన్ ఇచ్చాను.

తల్లి అతిశ్రద్ధ వల్ల వంశీ మూర్ఖుడిగా, మొండివాడిగా మారటానికెంతో కాలం పట్టలేదు.

క్లాసులు మొదలయిన రెండో రోజు నుండే, ఇంట్రస్ట్ లేని క్లాసులకి రావటం మానేశాడు. జ్వరం అనో, కడుపునొప్పి అనో క్లాసులు ఎగ్గొట్టేవాడు. తరచూ వాళ్ళమ్మొచ్చి లెక్చరర్స్‌ని కలిసి ఎంక్వయిరీ చెయ్యడం, నా దగ్గర వాళ్ళ మీద కంప్లయింట్సివ్వటంతో... వంశీతో కఠినంగా వ్యవహరించేసరికి, నాకో "నిక్‌నేమ్" తగిలించి పరోక్షంగా నా మీదున్న అయిష్టతని అందరితో పంచుకుని ఆనందించేవాడు.

మొదటి సంవత్సరం కొన్ని సబ్జెక్టుల్లో పాసయినా, రెండో సంవత్సరం పరీక్షలే రాయలేదు వంశీ.

వాళ్ళమ్మ నాకు, నేను పన్జేస్తున్న కాలేజీకీ శాపనార్థాలు పెట్టెళ్లింది. హీరోలా కాలేజీలో అడుగు పెట్టిన వంశీ, జీరోగా కాలేజీ నుండి బయటికెళ్ళాడు.

ఆ తర్వాత ఇదుగో మళ్ళీ ఇన్నాళ్ళకి కన్పించాడు.

వంశీలో అప్పటికీ, ఇప్పటికీ కొట్టొచ్చేలా కన్పిస్తున్న మార్పుల్లా... పెరిగిన గడ్డం, కళ్ళకి అద్దాలు, అస్తవ్యస్తంగా మురికిగా ఉన్న బట్టలు. ఎటుబడితే అటు చూసే పిచ్చి చూపులు...

"సార్! బాగున్నారా?" అనడుగుతాడనుకున్నాను.

"ఊఁహూ!... నోరు తిప్పలేదు.

"ఇటువైపు ఏనుండి వచ్చావా?" అనడిగాను.

"అవున్సార్! నేను డాక్టర్ని గదా! ఇప్పుడే ఓ పేషెంటుకి బైపాస్ సర్జరీ చేసి వస్తున్నాను" అన్నాడు చిత్రంగా కళ్ళు తిప్పుతూ...

**మళ్ళీ వాడి కళ్ళు ఎటో చూస్తున్నాయి. మళ్ళీ సిగరెట్ వెలిగించి, వెంట వెంటనే పీల్చి, మధ్యలో నా వైపు తిరిగాడు. వెంటనే... చేతిని వెనక దాచాడు. గాలితీవ్రత వల్ల, సిగరెట్ పూర్తిగా కాలిపోయి, చేతివేళ్ళకి 'చురుక్కు' మన్పించేసరికి, దాన్నలాగే కిందికి వదిలి, చెప్పుకాలితో నలిపేశాడు. అయినా అతనికి దృష్టి ఆకాశం నుండి దిగ రావటం లేదు.**

మళ్ళీ మాటలు నిలిపేశాడు.

"మీ అమ్మగారు..."

నా వైపు విచిత్రంగా చూసి... రెండు చేతులూ పైకెత్తి ఆకాశంవైపు చూస్తూ...

"మహా తల్లి... నన్నొంటరిని చేసి, మా నాన్న దగ్గరికెళ్ళి పైనుండి నేను ఆపరేషన్లు సరిగా చేస్తున్నానా? లేదా? అని చూస్తోంది. అదుగో చూడండి. కన్పిస్తోందా?" అని నా వైపు తిరిగాడు.

"వంశీ! ఏమైందిరా నీకు" బాధగా అన్నాను.

మళ్ళీ వాడి కళ్ళు ఎటో చూస్తున్నాయి. మళ్ళీ సిగరెట్ వెలిగించి, వెంట వెంటనే పీల్చి, మధ్యలో నా వైపు తిరిగాడు. వెంటనే... చేతిని వెనక దాచాడు. గాలితీవ్రత వల్ల, సిగరెట్ పూర్తిగా కాలిపోయి, చేతివేళ్ళకి 'చురుక్కు' మన్పించేసరికి, దాన్నలాగే కిందికి వదిలి, చెప్పుకాలితో నలిపేశాడు. అయినా అతనికి దృష్టి ఆకాశం నుండి దిగి రావటం లేదు.

"ఒకవేళ... వీడి జీవితం... ఈ కాలిపోయిన సిగరెట్‌లా, తల్లి భావాల బలవంతానికి బలయి, వీడిలా... అయ్యాడేమో!" నాలో నేను అనుకుని, నేనే కల్పించుకుని వంశీ భుజం తట్టి,

"వంశీ! మా ఇల్లు ఇక్కడికి దగ్గరే... నాతో వస్తావా?" అన్నాను.

నా వైపు అదోలా చూసి...

"ఇల్లూ లేదు... తల్లీ లేదు ఈ డాక్టరుకి ఆఁ..." అన్నాడు.

వచ్చీ పోయేవాళ్ళు మా ఇద్దర్నీ విచిత్రంగా చూస్తున్నట్టన్పించింది. ఎవరో ఒక పెద్దాయన మా పక్కనుండి వెళ్తుంటే, వంశీ గబగబా ఆయన ఎదురెళ్ళి...

"నమస్కారం! మీకేమైనా బైపాస్ సర్జరీ చెయ్యాలంటే నా దగ్గరకి రండి! ఫ్రీగా చేస్తాను. ఇదుగో నా విజిటింగ్ కార్డు" అని నలిగిపోయిన న్యూస్ పేపర్ ముక్క జేబులో నుంచి తీసిచ్చాడు.

ఆ ముసలాయన భయపడ్డట్టు, వంశీని ఎగాదిగా చూసి... వేగంగా ముందుకెళ్ళిపోయాడు. అక్కడే నిలబడి అతన్నే చూస్తున్న వంశీని దగ్గరకెళ్ళి పిల్చాను.

"ఆఁ... మీరే గదా! మీ ఇంటికి రమ్మన్నారు. అడ్రస్సివ్వండి" అన్నాడు చెయ్యి జాపి.

విజిటింగ్ కార్డు తీసిచ్చాను.

దాన్ని అటూ ఇటూ తిప్పి చూస్తూ...

"అవునూ... ఇందాకట్నుంచీ చూస్తున్నాను... అసలు మీరెవరు? మీ పేరు చెప్పలేదు... బై ద బై... ఐ యాం డాక్టర్ వంశీ, ఎం.బి.బి.ఎస్. అని కరచాలనం చెయ్యబోయాడు.

అతని మాటలకి ఆవాక్కయి చూస్తూ నిలబడ్డాను.

ఇంతలో... మా ఇద్దరి దగ్గరకి ఓ ఆంబులెన్స్ వచ్చి ఆగింది. అందులో నుండి గబగబా దిగిన ఇద్దరు అటెండర్లలో ఒకడు...

"ఒరేయ్! ఈడు ఇక్కడున్నాడ్రా! ఏం బాబు ఆపరేషన్ చెయ్యటానికి రోడ్డుకొచ్చావా? పొద్దుట్నుంచీ నీ కోసం ఊరంతా ఎతకలేక ఛస్తున్నాం గదరా! రా! ఎక్కు" అంటూ ఆ ఇద్దరూ... వంశీ దగ్గరకొచ్చి... రెండు చేతులూ పట్టుకుని ఈడ్చుకెళ్ళి మెంటల్ ఆస్పత్రి ఆంబులెన్సులో ఎక్కిస్తుంటే... నా వైపు దీనంగా చూస్తూ, వాళ్ళని విదిలించుకుంటూ,

"వదలండి! నన్నొదలండి! అదుగో! ఆయన నన్ను వాళ్ళింటికి రమ్మంటున్నాడు. ఎవరికో సర్జరీ చెయ్యాలట... నే వెళ్ళాలి. నన్నొదిలి పెట్టండి" అని వాళ్ళని వదిలించుకుని రాబోతుంటే...

"ఎక్కెహె..." అని వాళ్ళు వంశీ చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకుని బలవంతంగా వంశీని ఆంబులెన్స్‌లో ఎక్కించగానే అది వేగంగా ముందుక్కదిలింది.

వంశీ నిలబడ్డ చోట యధాలాపంగా చూశాను. అతని చెప్పుకింద కాలి నలిగి నుసైపోయిన సిగరెట్ ముక్క నా కంట బడ్డది. తల్లిదండ్రుల భావాల బలవంతానికి బలయిపోయి, పిచ్చివాడయిన వంశీ భవిష్యత్తులా అన్పించిందది.

